www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 ఆగస్టు 2023



గృహ రుణాలు మంజూరు చేయండి : కమిషనర్

నెల్లూరు : ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులను గుర్తించి వారికి విస్తృతంగా గృహ రుణాలను అందజేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ బ్యాంకర్లకు కోరారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిఓఆర్టి నెం.429ని అనుసరించి టిడ్కో ఇళ్లు మంజూరు అయినప్పటికీ పలు కారణాలతో రుణాలు మంజూరు కాని వారికి, వారి కుటుంబ సభ్యులను జాయింట్ ఓనర్‌గా గుర్తించి త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. మెప్మా పి.డి. రవీంద్ర, డిసిఒ రామ సుబ్బారావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎస్.బి.ఐ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎ.పి.జి.బి, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు మరియు నగరపాలక సంస్థ హౌసింగ్ ఫర్ ఆల్ సిద్దిఖ్, సందీప్, జరీనా, పెంచలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

భక్తుల సందడి..!

కొనసాగుతోన్న రొట్టెల పండుగ - నేటితో ముగింపు

నెల్లూరులో రొట్టెల పండుగ సందడి కొనసాగుతోంది. మంగళవారం నాలుగో రోజు బారాషాహిద్ దర్గా ప్రాంతంలోని స్వర్ణాల చెరువులో యాత్రికులు భారీగా తరలొచ్చారు. కేవలం ఒక్కరోజు మాత్రమే ఉండడంతో జిల్లా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చారు. కలెక్టర్, ఎం. హరినారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్ ఏర్పాట్లు పరిశీలించారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు ప్రతేడాది రాజకీయ, సినీ ప్రముఖులు తాకిడి ఉండేది. ఈ ఏడాది భక్తులు భారీగా తరలొచ్చినా ప్రముఖులు హాజరుకాలేదు.

నాలుగో రోజులు స్వర్ణాల చెరువులో భక్తుల సందడి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :రొట్టెల పండుగ నాలుగో రోజు మంగళ వారం ఉదయం కాస్త తక్కువ మంది భక్తులున్నా సాయంత్రానికి పెద్ద ఎత్తున తరలొచ్చారు. చల్లని గాలులు, చిరుజల్లులు కురిశాయి. వివాహం, ఆరోగ్యం, ఉద్యోగం, విదేశీయానం, గృహనిర్మాణం రొట్టెలకు ప్రాధాన్యత ఏర్పడింది. రొట్టెలను మార్చుకున్నారు. విజయవాడ, హైద రాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం వంటి ప్రాంతాల తోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి తరలొచ్చారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కుటుంబంతో దర్గాను సందర్శించారు. దర్గా అభివృద్ధికి తన వంతు కృషిచేశానని, ఎవరు కలిసి వచ్చినా తమ వంతు కృషిచేస్తానని తెలిపారు. అధికార యంత్రాంగ దీక్షా దక్షత, పారిశుధ్య కార్మికుల నిరంతర శ్రమతో అత్యంత పరిశుభ్రంగా దర్గా పరిసర ప్రాంతాలు కనిపించాయి. అనునిత్యం పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేస్తున్నారు. పోలీసులు సిసి కెమెరాల నీడలో అనునిత్యం భద్రతను చూస్తున్నారు. కలెక్టర్ ఎం. హరినారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్, నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. మరో ఒక్కరోజులో రొట్టెల పండుగ ముగుస్తుండడంతో జిల్లా వ్యాపితంగా భక్తులు తరలొస్తున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా జిల్లా అధికార యంత్రం ఏర్పాట్లు చేస్తుంది. నేటితో రొట్టెల పండుగ ముగుస్తుండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలొస్తున్నారు. ప్రతేడాది సినీ, రాజకీయ ప్రముఖులు రొట్టెల పండుగకు వచ్చిన తమ కోర్కెల రొట్టెలను పట్టుకునే వారు. ఈ ఏడాది ఇతర ప్రముఖులు ఎవరూ హాజరుకాలేదు. అతి కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు.

రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో నేతలతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంతనాలు

5న చంద్రబాబు రాక

-మేధావులతో ప్రత్యేక సమావేశం

-రాత్రి బస, ఏర్పాట్లు చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న నెల్లూరు నగరానికి రానున్నారు. ప్రముఖులు, మేధావులు, తటస్థులతో ఇన్ఫర్మేషన్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకోసం టిడిపి నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అనిల్ గార్డెన్, లేదా కస్తూరిబా గార్డెన్స్ పరిశీలిస్తున్నారు. రాత్రి ఇక్కడే బస చేసి, ఉదయం ప్రకాశం జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. బాబు పర్యటనకు సంబంధించి పొలిట్ బ్యూరో సభ్యులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మంగళవారం ముఖ్యనేతలతో టిడిపి కార్యాలయంలో సమావేశమయ్యారు. కార్యక్రమం ఏర్పాట్లు, ప్రాంత పరిశీలన, తదితర అంశాల పై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, నీటిపారుదల ప్రాజెక్టుల పై అవగాహన ఉన్న వ్యక్తులు, రైతులు, వ్యవసాయం - సాగునీటి ప్రాజెక్టుల అనుబంధ రంగాలలో పనిచేస్తున్న ఎక్స్‌పర్ట్‌లు, బాగా చదువుకొని తటస్థంగా ఉన్న ప్రముఖులతో చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుండి ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం, కావలి నియోజకవర్గం ఇన్ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, కోవూరు నియోజకవర్గం ఇన్ఛార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ సోమశిల ప్రాజెక్టు చైర్మన్ రాపూరు సుందర రామిరెడ్డి ఉన్నారు.

మహిళలపై హింసను నివారించాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి -మహిళా పోరు యాత్రకు ఘన స్వాగతం

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింస, దాడులు అమానుషనమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న హింస, దాడులను వ్యతిరేకిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'మహిళా పోరు యాత్ర' పేరుతో చేపట్టిన బస్సు యాత్ర నెల్లూరు మంగళవారం నెల్లూరు చేరుకుంది. అయ్యప్పగుడి సెంటర్‌లో యాత్రకు ఐద్వా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఘనస్వాగతం పలికారు. ప్రజానాట్య మండలికి మహిళా కళాకారులు ఆలపించిన గీతాలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం బొల్లినేని సెంటర్‌లో ఐద్వా రాష్ట్ర కమిటి, నగర, రూరల్ కమిటీ , ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఆ సభలో డి రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై ఘోరమైన హింస జరుగు తుందన్నారు. బిజెపి పాలనలో దేశంలో ప్రతిరోజూ ఏదో ఒకచోట మహిళలపై దౌర్జన్యాలు, అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో హింస జరుగుతుంటే అక్కడి పోలీసులు దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని అడ్డుకోకుండా వేడుక చూస్తున్నట్లు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసను అరికట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిం సను ఎదుర్కొనేందుకు మహిళలు బాల్య దశ నుంచి సిద్ధం కావాల్సిన అవసర ముందన్నారు.

ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో..

ఐద్వా యాత్ర నగరానికి వచ్చిన సందర్భంగా బాలాజీనగర్ ప్రాంతంలోని సిపిఎం కార్యాలయం సెంటర్‌లో మహిళలతో సభ నిర్వహించారు. ఈ సభకు ఐద్వా నగర కార్యదర్శి కె.పద్మ అధ్యక్షత వహించారు. సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో కుకి తెగకు చెందిన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించినటువంటి ఘటనపై దేశవ్యాప్తంగా మహిళా లోకం ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు సైతం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు. దీనిపై స్పందించిన కేంద్రం రాజస్థాన్‌లో జరగలేదా..ఛత్తీస్‌ఘడ్‌లో జరగలేదా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మానవత్వం ఉన్న రాజకీయ నాయకులెవరైనా సరే మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తా రన్నారు. అవి లేకనే మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆలోచనతో బిజెపి పాలకులు వ్యవహ రిస్తున్నారన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాని మౌనం సరికాదన్నారు. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంతో విపక్షాలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలను పెంచేందుకు దోహద పడుతున్న మద్యం, మత్తు మందులు, ఫోర్న్‌సైట్లను పూర్తిగా నిషేధించాలన్నారు.ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, అధ్యక్షురాలు టి.శివకుమారి, డికెడబ్ల్యు విశ్రాంతి లెక్చరర్ భారతి, ముత్రిపాడు మండలం ఐద్వా కమిటీ అధ్యక్షురాలు ఎం.ప్రమీల, ప్రగతిశీల అఖిల భారత మహిళా సమన్వయ నాయకురాలు వినోధిని, ఐద్వా నగర అధ్యక్షురాలు సుబ్బమ్మ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్‌కె మున్వర్, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్‌కె షంషాద్ పాల్గొన్నారు.

నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

అత్యాచార నిందితులకు కేంద్రం మద్దతు

సమాజంలో మహిళలపై చోటు చేసుకుంటున్న దాడులు, అత్యాచార ఘటనలు ఒక్క మణిపూర్ లోనే కాదని, దేశంలో అనేక ప్రాంతాల్లోఇదే తరహా దాడులు జరుగుతుంటే అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా అటువంటి వారందరికీ కేంద్ర ప్రభుత్వం మద్దతు పలుకుతుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. ఐద్వా బస్సు యాత్ర నెల్లూరు వచ్చిన సందర్భంగా అయ్యప్పగుడి సెంటర్‌లో ఐద్వా రూరల్ కమిటీ ఆహ్వానం పలికింది. అనంతరం సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ఐద్వా రూరల్ నాయకురాలు షేక్ షాహీనా బేగం అధ్యక్షత వహించారు. డి.రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై దారుణాలు జరుగుతున్నాయని తెలిసినా కేంద్ర ప్రభుత్వం పట్టిపట్టనట్లు వ్యవహరించడమే కాకుండా ఇతర రాష్ట్రాలతో ముడిపెట్టి దేశ ప్రధాని మాట్లాడటం దారుణమన్నారు.ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలోని బాలికలతో సమావేశం నిర్వహిం చారు. జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, అధ్యక్షు రాలు టి.శివకుమారి, రూరల్ ఐద్వా నాయకురాలు ఎస్. వరలక్ష్మి, మహాలక్ష్మమ్మ, సిఐటియు నాయకులు బత్తల కృష్ణయ్య, కిన్నెర కుమార్, బాబు, షంషాద్, ఆటో యూనియన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-ఉలవపాడు :మండలం లోని కరేడు ఎస్టీ బాలుర బాలికల పాఠశాలను కందుకూరు ఉపవిద్య శాఖ అధికారి శ్రీనివాస్ రావు మంగళవారం తనిఖీ చేశారు. ఆయన పాఠశాల ఆవరణంలోని మొక్కలను పరిశీలించారు. పాఠశాల లోని విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు, రమణయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి కృషి :శ్రీధర్‌రెడ్డి

కుటుంబంతో దర్గా సందర్శన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :బారాషాహిద్‌దర్గా అభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నానని, అందరితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం తమ కుటుంబంతో కలిసి బారాషాహీద్ దర్గాను సందర్శించుకున్నారు. రొట్టెను పట్టుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల నుంచి పవిత్ర బారాషాహిద్ దర్గాతో నాకు అనుబంధం ఉందన్నారు. గత నాలుగేళ్లుగా అధికారపార్టీ శాసనసభ్యుడిగా బారాషాహిద్ దర్గా అభివద్ధికి, ఈద్గా అభివద్ధికి శక్తికి మించి కషి చేశానన్నారు. బారాషాహిద్ దర్గా అభివద్ధికి తొలి పునాది రాయి వేసిందని కీర్తిశేషులు ఆనం వివేకానంద రెడ్డి అన్నారు. బారాషాహీద్ దర్గా అభివద్ధి కోసం జిల్లావాసిగా, కేంద్రమంత్రిగా వెంకయ్య నాయుడు టిడిపి ప్రభుత్వ హయాంలో మంత్రిగా నారాయణ , మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రస్తుత ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి వారివంతు దర్గా అభివద్ధికి కషి చేశారన్నారు. ఇప్పటివరకు బారాషాహీద్ దర్గాలో 15 కోట్ల రూపాయల పనులకుగాను 3 కోట్ల రూపాయల పనులు చేసి, బిల్లులురాక పనులు ఆపివేశారని, వాటిపై ఆదాల ప్రభాకర్ రెడ్డి బాధ్యత వహించి, మిగతా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. దర్గాలో మసీదు నిర్మాణానికి 7.5 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచి, 3 నెలలు పూర్తవుతున్నా ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. దర్గాలో నుడా నిధులతో ఆనాడు అధికార పార్టీ శాసనసభ్యుడిగా కోటి రూపాయలతో ముఖద్వారాలకోసం మంజూరు చేయించానని, 70శాతం పనులు పూర్తయ్యాయన్నారు. , రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి బాధ్యత వహించి, మిగతా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలిసి పనిచేసేదానికి సిద్ధమన్నార.

కుటుంబంతో కలిసి దర్గాను సందర్శించిన ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

ప్రతి ఇంటికీ 'జగనన్న సురక్ష'..!

5.77 లక్షలు సేవలందించాం .. -అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ప్రశంస

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఇంటికీ వెళ్లి, సేవలం దించిందని, ప్రభుత్వ లక్ష్యం పూర్తి చేశామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 23 నుంచి నిర్వహించిన కార్యక్రమంలో 769 సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన 5,77,374 సేవలను పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ, వార్డు సిబ్బంది ప్రతి గడపకు వెళ్లి సేవలందిస్తున్నా రన్నారు. నవరత్నాల కార్యక్రమం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ అందాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 2023, జూన్ 24 వ తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు 5 వారాల పాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అందులో బాగంగా జిల్లాలోని 769 సచివాలయాలు 13,744 క్లస్టర్ల పరిధిలోని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు ఇంటి ంటికి వెళ్లి ప్రజలకు అవసరమైన 5,85,323 సర్వీసెస్ లను నమోదు చేసుకొని, 5,77,374 సర్వీసెస్ లను పరిష్కరించడం జరిగిందన్నారు. సరైన ఆధారాలు లేనందున 6,415 సర్వీసెస్ లను తిరస్కరించగా, మిగిలిన 1,534 సర్వీసెస్ ఎస్.ఎల్.ఏ పిరియడ్లో వున్నాయని కలెక్టర్ వివరించారు. సర్వీసెస్ పరిష్కారంలో 98.78 శాతం మేర లక్ష్యం సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 8,37,465 కుటుంబాలకు గాను జగనన్న సురక్ష కార్యక్రమంలో 7,31,108 కుటుంబాలను కవర్ చేయడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్యాంపుల్లో 2,55,482 మంది ప్రజలు పాల్గొనడం జరిగిందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందచేసిన ఉచిత సేవల వలన సుమారు 2.97 కోట్ల రూపాయల ఆర్థిక పరమైన ప్రయోజనం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.కోవూరు మండల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నాణ్యతతో నిర్వహించినందుకు తహశీల్దార్ పద్మజ, మండల అభివద్ధి అధికారి శ్రీహరి, ఇఒపిఆర్‌డి ఆదినారాయణ, డిప్యూటీ తహశీల్దార్ ఇలియాజ్ లను కలెక్టర్ హరి నారాయణన్ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు పరిచినందుకు కషి చేసిన డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డిని, జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుని పటిష్టంగా నిర్వహించిన జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవిని, వారి సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. పాత్రికేయుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, డి.ఆర్.డి.ఎ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

"జగనన్న సురక్ష' విజయవంతంగా నిర్వహించిన పిడి సాంబశివారెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

లోకేష్‌కు టిడిపి నేతల వీడ్కోలు

ప్రజాశక్తి-కందుకూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విజయవంతంగా యువగళం పాదయాత్ర పూర్తి చేసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అడుగు పెడుతున్న సందర్భంగా యువనేత నారా లోకేష్ బాబుకు కు ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు వీడ్కోలు పలికారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో లోకేష్ బాబను కలిశారు. వారిద్దరూ కొంత సేపు మాట్లాడుకున్నారు.

లోకేష్‌తో ఎంఎల్‌సి 'కంచర్ల'

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విజయవంతంగా యువగళం పాదయాత్ర పూర్తి చేసుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలో అడుగు పెడుతున్న సందర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో కలిసి ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మంగళవారం వీడ్కోలు పలికారు. పాదయాత్రను ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులకు, టిడిపి శ్రేణులకు శ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు.

లోకేష్‌తో కంచర్ల శ్రీకాంత్

మట్టి తరలింపును అడ్డుకున్న 'ఇంటూరి'

ప్రజాశక్తి-ఉలవపాడు :మండలంలోని కరేడు గ్రామంలో వైసిపి నాయకుల మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తుండటాన్ని నిరసిస్తూ గ్రామస్తులు మట్టిని తరలిస్తున్న లారీలను, జెసిబిలను గ్రామస్తులతో కలిసి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అడ్డుకున్నారు గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ లు పొలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కష్ణమోహన్, సీనియర్ నాయకులు బంగారు రెడ్డి, రాచగర్ల శివ, బాలమురళి, కత్తి శ్రీహరి, పెల్లేటి హరిబాబు, పోలిశెట్టి, కొల్లి వెంకటరమణ, కత్తి కొండయ్య, నవీన్, కత్తి వెంకటేశ్వర్లు, గడ్డం నవీన్, కాటా బత్తిన వెంకటేశ్వర్లు, అంచ పోగు వాసు,నాయుడు ఆంజనేయులు ఉన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట : టిడిపి

ప్రజాశక్తి -వెంకటాచలం : టిడిపి హయాంలోనే మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగాయని తెలుగు మహిళా సర్వేపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలు చెముడు గుంట ప్రవీణ తెలిపారు.వెంకటాచలంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. మహిళలు గౌరవంగా తిరగాలన్న, స్వేచ్ఛగా బతకాలన్న ఒక చంద్రబాబు హయాంలోనే సాధ్యం అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని మహిళలు ఆదరించాలని కోరారు. తెలుగు మహిళ పొదలకూరు మండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, వెంకటాచలం మండలాల నాయకురాలు శివగిరి భువనేశ్వరి, బెల్లంకొండ కిష్టమ్మ, ముచ్చల సుధా ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-కందుకూరు :మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంగళవారం సిఐటియు అద్వర్యంలో మంగళవారం మున్సి పల్ కార్యాల యాన్ని ముట్టడించారు. యూనియన్ కార్యదర్శి శేషమ్మ అధ్యక్షత వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ఫర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. చనిపోయిన ,అనారోగ్యానికి గురైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. కమిటీ సభ్యులు వడ్డేముక్కల రవణమ్మ ,ఎద్దు కొండమ్మ, ఎలమందమ్మ, చెన్నమ్మ, బి మరియమ్మ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం శేషమ్మ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

వర్ల రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ నగరంలోని యుగంధర్ నగర్ లో ఆయన ఇంటివద్ద నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే కలిశారు. వర్ల రామయ్యకు బొకె అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గోచిపాతల ప్రసాదు, కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి దువ్వూరి రమేష్ చంద్ర ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ప్రజాశక్తి-కందుకూరు :రాజమండ్రి నుంచి కందుకూరులోని తమ బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్లేందుకు బస్టాండ్ దగ్గర దిగిన వేగి కిషోర్ సుమారు రూ.90,000 విలువ చేసే యాపిల్ ఫోన్ ను సోమవారం రాత్రి పోగొట్టుకున్నాడు. ఆటోలోనే పోగొట్టుకొని బస్సు ఎక్కి చూసుకోగా లేకపోయేసరికి కందుకూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. వెంటనే కందుకూరు టౌన్ ఎస్ఐ షేక్ మొహమ్మద్ హనీఫ్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి సి.సి కెమెరా ఫుటేజ్ ద్వారా ఆటోను గుర్తించారు. టవర్ లోకేషన్ ద్వారా ఫోన్ ఉన్న ప్రాంతం గుర్తించి ఫోన్ ను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. కందుకూరు టౌన్ పోలీస్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, రవితేజ లను యస్.ఐ షేక్ మొహమ్మద్ హనీఫ్ అభినందించారు.

టిడ్కో గృహాల పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నెల్లూరు :వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన ఎవి టిట్కో (జిప్లస్3) ఇళ్ల కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగిన లబ్దిదారులు వాటాగా 365 ఎస్ఎఫ్‌టి గృహానికి రూ.25 వేలు చెల్లించాలన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల కలర్ ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 6,7,8 తేదీలల్లో మూడు రోజుల పాటు నగరంలోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 350 మంది స్వాతంత్ర్య యోధుల కలర్ ఫోటోల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రషీద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఆవాజ్ జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇటువంటి ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తిని నేటి యువతలో, మహిళల్లో దేశ భక్తిని పెంపొందించాలన్న తపనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. లౌకికతత్వాన్ని కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వానించామన్నారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్‌కు గుంటూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ చరిత్ర కారులైన సయ్యద్ నసీర్ అహ్మద్ హాజరవుతారన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ చాన్‌భాషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హర్ష ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్, లతీఫ్ ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుడూరు :రామాయ పట్నం పోర్టు నిర్వాసిత నూతన నిర్మాణ గ్రామాలను సిఐటియు పోర్టు కమిటీ ఆధ్వర్యంలో కన్వీనర్ జి వెంకటేశ్వర్లు సభ్యులు టి మాల్యాద్రి, నూతల పాటి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆవుల వారి పాలెం, మొండివారిపాలెం గ్రామాల్లో నిర్మిస్తున్న గహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యలను వారు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇచ్చిన ప్యాకేజీ డబ్బులు, పాత ఇళ్లకు ఇచ్చిన డబ్బులతో నిర్మాణం చేసు కుంటున్నారు. సుమారు ఒక్కొక్క ఇంటికి రూ. 20లక్షలు వ్యయం కానుంది. పోర్టు యాజ మాన్యం ఇచ్చిన డబ్బులు అయిపోయాయి. ఇక తాము ఎలా బతకాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర వేటలేదు.. మహిళలు ఎండు చేపల అమ్మ కానికి వెళ్ళడం లేదు. రాబోయే కాలంలో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారేనుంది. స్కూలు నిర్మాణం నత్త నడకన సాగుతోంది. రేకుల షెడ్డులో పాఠాలు బోధి స్తున్నారు. పిహెచ్‌సిలేదు. సీజనల్ వ్యాధుల భారినపడు తున్నారు. వారికి ఇవ్వాల్సిన అర్అండ్అర్ ప్యాకేజ్ ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ముందుగా అర్అండ్అర్ ప్యాకేజ్ ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించి ఆ తరువాత గ్రామాలు ఖాళీ చేయాలని 2013 భూసేకరణ చట్టం చెబు తున్నా అక్కడ అవి అమలు కాలేదు. ఈ నేపథ్య ంలో ఆవులవారి పాలెం, మొండివారి పాలెంలో, బడి పిల్లల పాఠశాలల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, గుడి నిర్మించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంటనే నిర్మించాలని, రామాయ పట్నం పోర్టు కమిటీ నాయకులు,జి వెంకటేశ్వర్లు, టి మాల్యాద్రి, ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేవారు.

ఫ్లెక్సీ ధ్వంసంపై టిడిపి హైడ్రామా : వైసిపి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని సౌత్‌ఆములూరులో టిడిపికి చెందిన చుక్కల మల్లిఖార్జున్ వైసిపికి చెందిన ఫ్లెక్సీ చింపించి తనపై అనుమానం కలగకుండా టిడిపి ఫ్లెక్సీ కూడా చింపి హై డ్రామాకు తెరలేపారని వైసిపి నేతలు ఆరోపించారు. వైసిపి ఫ్లెక్సీని ధ్వంసం చేయడాన్ని ఆ పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని నరుకూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండిం చారు. వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, వైసీ పీ జిల్లా అధికార ప్రతినిధి త లమంచి సురేంద్ర బాబు ఉన్నారు.

టిడిపి కార్యకర్తల అరెస్టుపై విమర్శలు

మండలం సౌత్ ఆములూరు గ్రామానికి చెందిన టిడిపి కా ర్యకర్తలు చుక్కపల్లి మల్లికార్జు న్, అభిషేక్, వెంకటేష్ లను పోలీసులు అదుపులోకి తీసు కొని స్టేషన్ కు తరలించి ఆ తర్వాత విడిచిపెట్టారు. వైసిపికి చెందిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు కాబట్టి తీసుకొచ్చామని పోలీ సులు చెబుతున్నారు. కేవలం ఫ్లెక్సీలు ధ్వంసం చేసినందుకు దారికాచి పట్టుకోవాల్సినంత నేరమా అని చర్చించుకుంటున్నారు.

పబ్లిక్ స్థలాల విక్రయంపై

గ్రామస్తుల పెదవి విరుపు

తోటపల్లిగూడూరు :పబ్లిక్ పర్పస్ కింద పంచాయతీకి వదిలిపెట్టిన రూ. కోట్ల విలువ చేసే భూమిని ఫోర్జరీ అగ్రిమెంట్ సష్టించి విక్రయించి వైసిపి అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలం వరిగొండ గ్రామ పంచాయతీ బిట్-2 ప రిధి (కాకుపల్లి) వద్ద పోర్టుసిటీ లే అవుట్లలో పబ్లిక్ పర్పస్ కో సం రియల్ ఎస్టేట్ వ్యాపారులు విడిచి పెట్టిన పది శాతం భూములను అదే ప్రాంతానికి చెందిన ఓ వైసిపి నాయకుడు, వ్యక్తులు ఆక్రమించుకొని అమ్మేసు కొంటున్నట్లు వార్తలు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ జరిపించి, అక్రమాల కు పాల్పడుతున్న ఆ వైసిపి చర్యలు తీసుకుని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆశా వర్కర్లకు అవగాహన

ప్రజాశక్తి-గుడూరు :మండలంలోని ఆశా వర్కర్లకు తల్లిపాల వారోత్సవాలపై జాతీయ కార్యక్రమాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. గుడ్లూరు వైద్య ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులను సమావేశపరిచి విస్తతంగా అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ మారుతీరావు తెలిపారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమం జరగనున్న ఈ సందర్భంగా ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండి పని చేయాలన్నారు. వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' సేవలు అభినందనీయం

నెల్లూరు : రొట్టెల పండుగకు విచ్చేసిన భక్తులకు వైద్యసేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ వైద్య సేవలు అభినందనీయమని ఎస్పి డాక్టర్ కె.తిరుమలేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాలుగో రోజు వైద్య సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ ఉచిత వైద్య శిబిరంను సందర్శించిన ఎస్పీ బ్లడ్ ప్రేజర్ (బిపి) చూపించుకొనిమాట్లాడారు. అడిషినల్ ఎస్పి హైమవతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం పరిధిలోని విశ్వనాథరావుపేట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పిల్లలు మధ్యాహ్న భోజనాన్ని 75శాతం మాత్రమే తినడం గమనించి ఆయన, 100శాతం పెంచేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రధానోపాధ్యాయులు ఠాగూర్‌కు సూచించారు. అక్కడ ఉన్న విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా తిని రుచి చూసి నాణ్యత ప్రమాణాలు పెంచవలసిందిగా మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీని ఆదేశించామన్నారు. అక్కడే జరుగుతున్న నాడు-నేడు పనులు కూడా తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేసి వెంటనే త్వరగా పనులు పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జయలక్ష్మి, నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు ఠాగూర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి వినియోగదారులకు రక్షణ కల్పించాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. తూకాల్లో తేడాలు ధరల్లో వ్యత్యాసం కల్తీల జోరు ఎక్కడ చూసినా కనపడు తుందన్నారు. ప్రతి వినియోగదారుడు నష్టపోయినప్పుడు రసీదు తీసుకొని వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందాలని తెలిపారు. ప్రజలు పౌర సంస్థలు నిరంతరం ప్రజలను చైతన్యపరిచి సమాజంలో కల్తీలు లేని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి చట్టాలను పటిష్టంగా అమలు చేసి వినియోగదారులను రక్షణ కల్పించాలని కోరారు.

సచివాలయంలో ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి-సంగం : మండల కేంద్రంలోని సచివాలయంలో మంగళవారం ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణకుమారి పరిశీలించారు. సచివాల యంలో రికార్డులు పరిశీలించి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరుపై కొంత అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని సూచించారు. పనితీరు మెరుగుపరుచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బిఎల్‌ఒలు చేస్తున్న ఇంటింటి ఓటర్ సర్వేను పరిశీలించారు. ఓటరు సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఇఒపిఆర్‌డి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రసన్న

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన చింతగుంట గాయత్రి పుట్టుకతో బ్రెయిన్ ఎదుగుదల లేక కాళ్లు, చేతులు పనిచేయక మంచానికే పరిమితమైంది. పెన్షన్ అప్లై చేయుటకు వేలి ముద్రలు పడ నందున, గాయత్రి మందులు, ఇతర ఖర్చుల నిమిత్తం కోవూరు శాసన సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తన సొంత నిధులు రూ.5వేలు వలంటీర్ ద్వారా అందజేశారు. పెళ్లకూరు కాలనీ కి చెందిన పూసల చెంచమ్మ అనే వద్ధురాలు దీర్ఘ కాలిక వ్యాధుల సమస్య తో మంచానికే పరిమితమైనందున ఆమె మందుల కోసం రూ.2,750 మండల సచివాలయం కన్వీనర్ కవరగిరి ప్రసాద్, స్థానిక వైసిపి నాయకులు పాలపర్తి రమేష్ ద్వారా అందజేశారు. మొత్తం రూ.7750 కొన్ని నెలలు గా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేయుచున్నారు,ఈ సంధర్భంగా వ్యాధి బారిన పడిన వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలియజేశారు.

జీవిత చరిత్రలు గుర్తుండిపోవాలి

ప్రజాశక్తి-కోవూరు : స్వాతంత్ర్య వీరుల ఫొటోలు వాళ్ల జీవిత చరిత్రలు రాబోయే తరాలకు గుర్తుండిపోవాలని ఆవాజ్ ముస్లిం డెవలప్మెంట్ ఫొరం ఆధ్వర్యంలో స్థానిక సీతా పోలయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆవాజ్ ముస్లిం మైనార్టీస్ డెవలప్మెంట్ ఫొరం జిల్లా సభ్యులు ఎస్‌కె చాంద్ బాషా పాల్గొన్నారు. నెల్లూరు పట్టణంలోని అపోలో ఆస్పత్రి ఎదురుగా జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6,7,8 తేదీల్లో స్వాతంత్ర వీరుల ఫొటోలు వాళ్ల జీవిత చరిత్రలు ఎగ్జిబిషన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొనాలని, వచ్చేటప్పుడు ప్రతి ఒక్కరి పిల్లలను కూడా తీసుకొని రావాలన్నారు. ఎంట్రీ ఫీజు ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని కోరారు. ఆవాజ్ కమిటీ బాధ్యులు ఎస్‌కె బాబు, కరీముల్లా, హుమయున్ అప్రోచ్, బాబు మేస్త్రి, ఖాదర్ బాషా, కాలేషా పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ శాంతినగర్‌లోని ఎంపిపిఎస్ గిరిజన పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు 100 మందికి సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం పథకానికి, ప్లేట్లు నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఎం.దిలీప్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొసైటీ సభ్యులు పఠాన్ రహమతుల్లా ఖాన్, దాత నరసయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి ప్రసాద్ రావు, ఉపాధ్యాయులు ఇంతియాజ్ అహ్మద్, ఎన్.పద్మావతి, సిహెచ్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం అల్లిపడుగు పంచాయతీ కడనూతల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల దినోత్స వాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మహిళా సంరక్షణ కార్యదర్శి జయశ్రీ పాల్గొని మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు తల్లి పాలను అందించడం వల్ల బిడ్డలలో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, బాలింతలు, గర్భిణులున్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలోని సెక్టార్ 2 తల్లిపాల వారోత్సవాలు మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారదమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, అంతేకాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బొగ్గుబట్టీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని కనియంపాడు, వేంపాడు, విరువూరు, తూర్పు పాలెం, పెద్దిరెడ్డిపల్లి, గ్రామాల్లో 6కు పైగా నిబంధనలకు విరుద్ధంగా బొగ్గుబట్టీలు నిర్వహిస్తూ దర్జాగా సాగిస్తున్నారు. ఎక్కువశాతం బట్టీలు జనావాసాల మధ్య ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అనుమతి ఒకచోట ఉంటే మరోచోట బొగ్గుబట్టీలను కాల్చడంలాంటి పనులు నిర్వాహకులు చేస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కర్రతుమ్మ కర్రనే మాత్రమే బొగ్గు బట్టీకి వినియోగించాల్సి ఉండగా విలువైన వేప, తెల్లతుమ్మ, నేరేడు, లాంటి కలపను గుట్టు చప్పుడు కాకుండా వినియోగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనియంపాడులో అడవి కర్రను సైతం బట్టీలో పేర్చి బొగ్గుగా మారుస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇన్ని జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చీమకుట్టినట్లైనా లేకపోవడం గమనార్హం. వాస్తవానికి బొగ్గుబట్టీలు ఊరికి కనీసం దూరంలో ఉండాలి అనే నిబంధనలున్నాయి. వాటిని పట్టించుకోకుండా నిర్వాహకులు ఇళ్ల మధ్యనే బొగ్గు బట్టీలను ఏర్పాటు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవల కాకినాడ మున్సిపాలిటీకి బదిలీ అయిన కమిషనర్ ఎం.రమేష్ బాబును మంగళవారం ప్రస్తుత కమిషనర్ [illegible] ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. [illegible] కమిషనర్ ఎం.రమేష్ బాబు [illegible] కొనియాడారు. [illegible] మున్సిపాలిటీ అభివృద్ధి చేయగలిగామన్నారు. మున్సిపాలిటీ ఉద్యోగులు, కౌన్సిలర్లు [illegible] అని సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు [illegible] పాల్గొన్నారు.

మహిళలపై నిర్లక్ష్య ధోరణిని విడనాడాలి

మహిళా పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులు, మహిళలపై రోజురోజుకూ వివిధరూపాల్లో పెరుగుతున్న హింసను ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని రవిరిక కళ్యాణమండపం నుండి కళాకారుల నృత్యాలతో మహిళా పోరుయాత్ర కొనసా గింది. పోరుయాత్రకు సిపిఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ రంగంలో కళాకారులు ప్రదర్శన మహిళలపై జరుగుతున్న అకృత్యా లపై కళారూపాలతో ప్రజలకు వినూత్న రీతిలో చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో దేశంలో పురుష సమాన త్వాన్ని ప్రోత్సహించాలన్నారు. చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేయాలని, జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సులు అమలు చేయాల ని, చేయిచేయి కలుపుదాం హింసలేని సమా జాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులు మహిళలపై హింస రోజుకు పెరుగుతుంద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వాలు హింస అరికట్టే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. మహిళా మల్లయోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన తడి ఆరలేదన్నారు. మణిపూర్‌లో కుకీ ఆదివాసీ మహిళలను నగ్న ప్రదర్శన కుదిపేస్తుందని తెలిపారు. ఢిల్లీలో శ్రద్ధా వాకర్ బాంబేలో సరస్వతి వైద్యుల్ని చెరకుపల్లిలో అమర్నాథ్‌పై అతి క్రూరంగా జరిగిన హత్యలు దేశానికి, సమాజానికి అప్రతిష్ట నిలయమన్నారు. దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషానికి ఒక అఘాయిత్యం జరుగుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఇవి మరింత పెరిగాయని తెలిపారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ లాంటి వారు మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర ప్రభుత్వం వారిని శిక్షించేందుకు అన్ని విధాల కొనుక్కుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మహిళలపై చులకన భావం ఉందని, స్త్రీలను రెండవ స్థాయి వ్యక్తులుగా లైంగిక వస్తువులుగా మనవాద బిజెపి మూకాలను రెచ్చగొడుతుందన్నారు. ఫోక్సో చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత కాలంలో మహిళలపై ఆంక్షలు విధించి అణిచివేతకు గురిచేసిన పురుషాధిపత్య సిద్ధాంతాన్ని తిరిగి సమాజంపై, మహిళలపై బలవంతంగా రుద్దుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూడా ఐద్వా విలేజ్ క్రైమ్ రేట్ వివరాలను పెరిగిందని, కృష్ణానది తీరంలో యువతులపై దాడి చేశారని తెలిపారు. గుంటూరులో డెంటల్ విద్యార్థి హత్య రమ్య హత్య విశాఖలో వరలక్ష్మి హత్య సంచలనం కలిగించాయన్నారు. ఇలా మహిళలపై నేరాలు 25 శాతం పెరుగుతుందన్నారు. ఈ నేరాలు పెరగడానికి మద్యం మత్తు పదార్థాలు ప్రధానంగా ఈ నేరాలు పెరగడానికి ఒక కారణమని అనేక సర్వేలు తెలుపుతున్నప్పటికీ వాటిని అరికట్టే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడంపై అనేక కుటుంబాలు వేదన పడుతున్నాయని ఆమె ఆవేదన చెందారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్ బీ, టి శివకుమారి, జిల్లా మహిళా నాయకులు షేక్ శంషాద్, ప్రమీల, కె.పద్మ, మండల ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, కొండా లక్ష్మమ్మ, వి.పద్మ, గంట లక్ష్మీపతి, డేవిడ్ రాజు, ఆత్మకూరు నాగయ్య, లక్కు కృష్ణ ప్రసాద్, ఎం.నాగేంద్ర, సాలారుద్దీన్, నంద శీను, గద్దర్ బాబు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ముదివర్తిపాలెం - ముదివర్తి కాజ్ వే నిర్మాణం పూర్తిచేయాలని సిపిఎం ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ స్థాయిలో పల్లిపాడు నుండి 17వ తేదీన జరగబోయే పాదయాత్రను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని సిపిఎం కార్యాల యంలో నాయకులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఇందుకూరుపేట మండలంలో కాజ్వే నిర్మాణం త్వరగా చేపట్టాలని పాదయాత్ర నిర్వహిస్తున్నా మన్నారు. పెరిగిన నిత్యావసర ధరలపై, బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడారు. బిజెపికి వత్తాసు పలుకుతున్న వైసిపి, టిడిపిలపై ధ్వజమెత్తారు. ప్రజలు మేల్కొని తిరుగుబాటు చేయకపోతే భవిష్యత్తు లేదన్నారు. సిపిఎం మండల అధ్యక్షులు మైపాటి కోటేశ్వరరావు, తిక్కవరపు ప్రభాకర్ రెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్కే చాన్‌బాషా, కార్యదర్శి మనోహర్, డివైఎఫ్ఐ అధ్యక్షులు చీమకుర్తి శ్రీనివాసులు రెడ్డి, లీగల్ అడ్వైజర్ శ్యామ్ రెడ్డి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టివివి ప్రసాద్

విద్యుత్ కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-అనంతసాగరం : విద్యుత్ కార్మికులు చేసే సమ్మెకు సిఐటియు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం మండల యుటిఎఫ్ కార్యాల యంలో విద్యుత్ కార్మికుల సమావేశం సిఐటియు మండలాధ్యక్షులు మీరామొహిద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వి శివ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు ఇస్తుందన్నారు. అలాగే విద్యుత్ రంగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ ద్వారా డైరెక్ట్ పేమెంట్ చెల్లించాలన్నారు. కాంటాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల న్నారు. విద్యుత్ ఉద్యోగుల పిఆర్‌సి 2022ను వెంటనే అమలు చేసి జెఎల్ఎం గ్రేడ్ 2 ల సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ప ర్స్ యూనియన్ నాయకులు నాగమణి, సునీత, భనికా నాయకులు రహమతుల్లా, నాగులూరు వెంకటేష్, విద్యుత్ కార్మిక సంఘం నాయకులు హరి, ఆశిక్, స్కూల్ స్వీపర్స్, యూనియన్ నాయకులు సరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు బీమా ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. క్లాస్ 1 అధికారులు, క్లాస్ 2 అధికారులు, క్లాస్-3 ఉద్యోగులు కుటుంబాలు పింఛను వేతన సవరణ రిక్రూట్మెంట్ వీటి డిమాండ్ కోసం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మోహన్ కుమారి మాట్లాడుతూ కుటుంబం పింఛను వేతన సవరణ రిక్రూట్‌మెంట్ ఇవన్నీ వెంటనే చేపట్టాలని కొనియాడారు. ఎబిఎన్ శివకుమార్, ఎడి రవికుమార్ మాట్లాడుతూ సమస్త అభివృద్ధితోపాటు అందరం కలిసి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు శ్యామ్‌ప్రభాకర్, కార్యదర్శి ఎవి రమణయ్య, రమేష్, ప్రవీణ్, ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా అందజేత

ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట

అకాల మరణంతో మృతి చెందిన కుటుంబాన్ని వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని జక్కపల్లి గూడూ రు సర్పంచ్ బండ్ల సురేష్ గౌడ్ పేర్కొన్నారు. జక్కపల్లి గూడూరు పంచాయతీ సోమేశ్వరపురం గ్రామం లో ఇటీవల మరణించిన గంజాం శ్రీనాథ్ కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకం కింద మొదట రూ.10వేలను సర్పంచి బండ్ల సురేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అన్ని కులాల వారికి వారివారి వృత్తులు చేసుకునేందుకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. జక్కపల్లి గూడూరు గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అరటిపల్లి వరదరెడ్డి, సిహెచ్ రామయ్య, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్, గృహసారథి కోనేటి రాంబాబు, వలంటీర్ బ్రహ్మయ్య, గంజాం శ్రీనాథ్ కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

పెద్దన్నలూరులో 'సంజీవని ఆరోగ్య రథం'

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని పెద్దన్నలూరు రామాలయం వద్ద కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే "సంజీవని ఆరోగ్య రథం" అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 160 మంది గ్రామస్తులు డాక్టర్‌ను వివిధ ఆరోగ్య సమస్యలతో సంప్రదించారు. 110మంది కంటి చూపు సమస్యలకుగానూ మొత్తం 270 మంది చికిత్స తీసుకున్నారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దబ్బగుంట మాలకొండయ్య (బుజ్జయ్య), ప్రసాద్, డి.మస్తాన్‌బాబు, డి.అశోక్, ప్రసాద్, యశ్వంత్, హజరత్తయ్యా, తిరుపాల్, అనిల్ బాబు, మస్తాన్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి బియ్యం వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి ఉషా నర్సంగ్ హోమ్ డాక్టర్ సతీష్ భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి మంగళవారం 10 కట్టలు బియ్యం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ గత 8 నెలల కాలం నుండి డాక్టర్ సతీష్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతినెలా అడగకుండానే అనాథ పిల్లల కోసం బియ్యం పంపుతున్న డాక్టర్ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు జీవి శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం కమిషనర్ బి.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానన్న ముఖ్యమంత్రి తమ వాగ్దానాన్ని అమలు చేయాల న్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని ప్రతినెలా 1వ తేదీ కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. 2017 నాటి జీతం అలయన్స్ బకాయిలు రూ.24వేలు వాయిదాలలో చెల్లించాలని కార్మికులకు సోపు, చమురు, యూని ఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు గౌరవ అధ్యక్షులు డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, గురవయ్య, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలిరూరల్ : సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు పనులు బందు చేసి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నుండి ప్రదర్శనగా బయల్దేరి మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని అక్కడ ప్రధాన గేటు వద్ద కార్మికులు బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె రెహానా బేగం, పాల్గొని వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి గతంలో కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఇటువంటి స్పందన లేదని విమర్శించారు. కార్మికులు కరోనా కష్టకాలంలో వారి ప్రాణాలను కూడా పణంగా పెట్టి పారిశుధ్య పనులు చేసి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడారని తెలిపారు. ఇలాంటి కార్మికులను మన ముఖ్యమంత్రి చిన్న చూపు చూడడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. డైలీ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.8వేలు ఇచ్చి పనులు చేయిస్తున్నారని ఈ ప్రభుత్వానికి ఇది న్యాయమా అని వారు ప్రశ్నించారు. డ్రైవర్లుగా పనిచేస్తున్న కార్మికులకు నెలకి రూ.10వేలు ఇచ్చి వారితో పనులు చేయించడం చాలా దుర్మార్గమ న్నారు. అంతేకాకుండా కార్మికులకు ఇచ్చే పనిముట్లు బ్లౌజులు, కొబ్బరి నూనెలు, సబ్బులు, యూనిఫారం, కూడా ఇవ్వకుండా పనులు చేయించడం ఈ ప్రభుత్వానికే తగునా అని ప్రశ్నించారు. కార్మికుల పొట్ట కొట్టిన ఏ ప్రభుత్వాలు కూడా మనుగడ సాగించలేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి కార్మికులకు ఇచ్చిన పర్మినెంట్ హామీతో పాటు క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, డైలీ కార్మికులను అవుట్సోర్సింగ్‌లో చేర్చాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పట్టణాల విస్తరణ మేరకు తగినంత మంది కార్మికులను నియమించా లని, కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లుతో పాటు ఇతర వస్తువులను వెంటనే ఇవ్వాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనెఫిట్స్ కల్పించాలని, పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించకుంటే 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, జి.మధుసూదన్ రావు, యూని యన్ నాయకులు తురక సీనయ్య, బిడ్డల మహేష్, ఒంగోలు రమేష్, మహిళా కార్మికులు పి.చిన్నమ్మ, అనిత, జ్యోతి, రాజేశ్వరి, రాగమ్మ, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

కావలిలో..

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న మాజీఎంఎల్ఎ బొల్లినేని

ప్రజాశక్తి-ఉదయగిరి

మహిళల అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్పి మాజీచైర్మన్ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో మహాశక్తి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారత కోసం కృషి చేశారని ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డ్వాక్రా సంఘాలను ప్రారంభించి మహిళల ఆర్థికంగా ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని తెలిపారు. మహిళల్లో పొదుపు ఉద్యమానికి చంద్రబాబు కృషి మరువలేనిదని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో మేనిఫెస్టోలో మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, జిల్లాలలో ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం తల్లికి వందనం పథకం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు భరోసా ఇచ్చిన ఏకైక వ్యక్తి చంద్రబాబు అని తెలిపారు. అలాగే ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500 ఇస్తామని ప్రకటించారన్నారు. అనంతరం మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, షేక్ రియాజ్, వెంకటస్వామి మాజీ జెడ్‌పిటిసి జ్యోతి, సర్పంచ్ భాగ్యమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు అక్కమ్మ, అరునమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మహిళల భవిష్యత్తుకే పెద్దపేట వేస్తూ మహాశక్తి పథకం టిడిపి ప్రవేశపెట్టిందని కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లేబూరు గ్రామంలో మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహిళలు అభివృద్ధి చెందే విధంగా మహాశక్తి పథకం ముందుకు తీసుకొచ్చారన్నారు. లేబూరు మహిళలు పెద్ద ఎత్తున పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షు లు రావెళ్ల వీరేంద్ర చౌదరి, కార్యనిర్వక కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, చేముకుల కష్ణ చైతన్య, మైనార్టీ నేత ఎస్‌కె ఇంతియాజ్, మునగాల రంగారావు, తదితరులున్నారు.

బిఎల్‌ఒలతో తహశీల్దారు సమీక్ష

ప్రజాశక్తి-సంగం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ నాగరాజు బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటి ఓటరు సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలని సూచించారు. జీరో డోర్ నెంబర్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఒక కుటుంబంలో పది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌లు అశోక్, ప్రవీణ్, ఆర్ఐ రాజ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **DACHARLA SRIDEVI,** (Old Name) W/o **DACHARLA SREENIVASULU,** resident of D.No: 22-2-26, Sai Nagar, 2nd Lane, Kovur Road, Kandukur, SPSR Nellore Dist. I have Changed my Name from **DACHARLA SRIDEVI** to **UNNAM SRIDEVI** (New Name), W/o **DACHARLA SREENIVASULU,** Hence forth i will be known as **UNNAM SRIDEVI** will be applicable for all purposes.

ప్రమాదకరంగా మలుపు..

సూచిక బోర్డు లేకుండా ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రజాశక్తి-వరికుంటపాడు

పామూరు నుండి పెద్దిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డులో విరువూరు ఎస్‌సి కాలనీ సమీపంలో ఉన్న మలుపు ప్రాణాంతకరమైనదిగా ప్రజలు భావిస్తున్నారు. పూర్తిగా వంకర తిరిగి, ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడం, స్పీడ్ బ్రేకర్లు సైతం లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మలుపులు వద్ద ఏ సమయానికి ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతు న్నారు. ఆర్‌అండ్‌బి అధికారులకు చీమకుట్టైన లేకపోవడం బాధాకరం. అలాగే ఇదే రోడ్డుకు సంబంధించి సుమారు 10 కిలోమీటర్ల దూరం అన్ని మలుపులతోనే రోడ్డు ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు కోట వర్దిపల్లి, కృష్ణంరాజు పల్లి, నార్త్ కొండాయ పాలెం, పెద్దిరెడ్డిపల్లి, గ్రామాల పరిధిలోనే రోడ్డు 5 మలుపులు ఉండడం గమనార్హం. ఈ ప్రాంతంలో ఎక్కడ కూడా సూచిక బోర్డులు లేకపోవడం మరి దారుణం ఉన్నత అదికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు దాటడం భయంగా ఉంది : గుబిలి రత్తయ్య గ్రామస్తుడు

తరచు రోడ్డు దాటి వెళ్లడం ఎలాంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహ నాలు వేగంగా వస్తు న్నాయి. దాంతో రోడ్డు దాటాలంటే భయం వేస్తుంది.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి : చీపతి ఇశ్రాయేలు గ్రామస్తుడు

ప్రకాశం జిల్లా పామూరు నుండి ఇరు వురు ప్రాంతానికి వచ్చే వాహనాలు అతి వేగంగా నడుపుతుంటారు. ఎలాంటి సూచిక బోర్డులు లేని కారణంగా మలుపులు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ప్రయాణికులది. ఫలితంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. కావున సూచిక బోర్డులు ఏర్పాటు చెయాలి.

పిల్లలను స్కూలుకు పంపాలంటే భయమేస్తుంది : గుబిలి చిన్నమ్మి గ్రామస్తురాలు

ఎస్‌సి కాలనీ నుండి ఊర్లో ఉన్న స్కూలుకి పిల్లలను పంపాలంటే భయమేస్తోంది. రోడ్డు వైపు నుంచి అతి వేగంగా వస్తున్న వాహన దారులు మలుపు వద్ద రోడ్డు కనిపించక ఎక్కడ పిల్లలను ఢీ కొంటారో అని భయమేస్తుంది.

కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

L A O P No.75/2009

Between:

L. A.O., RDO కావలి - Petitioner

Vs

జి.రామచంద్ర రావు
మరియు ఇతరులు - Respondents

To,

R.5) **మంగళపూడి హరినాథ్ రెడ్డి,** జమ్మలపాలెం, జలదంకి (మం), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అను వారికి,

పైనెంబరు L.A.O.P.No.75/2009 పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే10-08-2023దికి** వాయిదా వేయబడి ఉన్నది. కనుక ఆ దినం పగలు **10.30. గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు
ఎం.వి. సుబ్బానాయుడు,
A. G. P., కావలి.

కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

L A O P No.80/2009

Between:

L. A.O., RDO కావలి - Petitioner

Vs

మార్తల రామయ్య,
మరియు ఇతరులు - Respondents

To,

R.4) **పంచాంగుల రామమూర్తి,** చింతలదేవి గ్రామం, కొండాపురం (మం.), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

R.36) **బత్తిన నారాయణ,** చింతలదేవి గ్రామం, కొండాపురం (మం.) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అను వారికి,

పైనెంబరు L.A.O.P.No.80/2009 పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే10-08-2023దికి** వాయిదా వేయబడి ఉన్నది. కనుక ఆ దినం పగలు **10.30. గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు
ఎం.వి. సుబ్బానాయుడు,
A. G. P., కావలి.